క్లుప్తంగా

అయ్యప్పస్వామికి పూజలు



అమరచింత: పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్ప ఆలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఏర్పాటు చేసిన బిక్షకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈమేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కఠినమైన దీక్షతో స్వామివారి మాలధారణ చేస్తున్న భక్తులు లోక కల్యాణం కోసం స్వామివారిని పూజించాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వామి టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, కమలాకర్‌గౌడ్, అయూబ్‌ఖాన్, పోసిరిగారి విష్ణు, శ్యాం, మహేందర్ రెడ్డి, నరసింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కల్వరాల విద్యార్థులు



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సీఎం కప్ అథ్లెటిక్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ విభాగంలో ప్రతిభ కనబర్చిన ఎండీ రేహాన్, మీనాక్షి హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రాజవర్ధనాచారి తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులను పిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఖిల్లాఘనపురం మండలం తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, పీడీ చందర్ తెలిపారు. ఈ నెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ టోర్నమెంట్‌లో ఏడో తరగతి విద్యార్థి పి.సిద్ధార్థ్ కిక్ బాక్సింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. ఈ నెల 27న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ విభాగంలో కిక్ బాక్సింగ్‌లో జిల్లా తరఫున పాల్గొంటాడని వారు చెప్పారు.

ఆదర్శ రైతులకు సన్మానం



వనపర్తి రూరల్: జాతీయ రైతు దినోత్సవ సందర్భంగా సోమవారం చెలిమి సంస్థ అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మదిలేటి గ్రామానికి చెందిన ఆదర్శ రైతులు సుజాత, కిషన్ ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిరాజాచారి, వరదాచారి, షఫీ, పీడీ శ్రీనివాసులు, సుచరిత, జితేందర్, శోభ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ సిబ్బంది వినూత్న నిరసన



వనపర్తి: తమకు ఉద్యోగ భద్రత కల్పించటంతో పాటు వేతనాలు పెంచాలని కొన్ని రోజులుగా ఎస్ఎస్ఏ సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఒక ఉద్యోగి గొడుగు, తలపై టీ కప్పు ధరించి మోటర్ సైకిల్‌పై శిబిరం వరకు వెళ్లి వినూత్నంగా నిరసన వ్యక్తం చేయటం ప్రజల చూపును ఆకట్టుకుంది.

క్షుద్ర పూజల కలకలం



గోపాల్‌పేట: పట్టపగలే క్షుద్రపూజలు చేసిన ఘటన మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో చోటుచేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని రాంగన్‌కాలనీకి చెందిన ఎంగరిగళ్ల పరశురాములు సోమవారం తన ఇంట్లోనే ఉన్నాడు. మధ్యాహ్నం ఇంటి బయటికి వచ్చి గేటు వద్ద చూస్తే కుంకుమ, పసుపు, నిమ్మకాయలు, మిరపకాయలు, చిన్న బొమ్మ కనిపించాయి. దీంతో ఆందోళనకు గురైన పరశురాములు వారి కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల వారిని పిలిచి చూపించాడు. ఇలా ఇళ్ల ముందు క్షుద్రపూజలు చేసి భయాందోళనకు గురి చేస్తే కాలనీలో ఎలా ఉండాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

ముమ్మరంగా నర్సరీల పనులు

- 2025 సంవత్సరం లక్ష్యం 1.95 లక్షల మొక్కలు
- పూర్తయిన బ్యాగ్ ఫిల్లింగ్



అప్పారెడ్డిపల్లి గ్రామనర్సరీ



మానాజీపేటలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ (ఫైల్)

ఖిల్లాఘనపురం: మానవ మనుగడకు కారణమైన చెట్లను పెద్ద ఎత్తున పెంచాలని పట్టణ ప్రాంతాలతో పాటుగా గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించి పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి నర్సరీల నిర్వహణ పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. గతేడాది కంటే ముందుగానే బ్యాగ్ ఫిలింగ్ పనులు పూర్తి చేసిన అధికారులు నర్సరీలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబర్ చివరి నాటికి అన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో విత్తనాలు నాటే పనులు పూర్తి పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం మండల అధికారులు నర్సరీలను సందర్శిస్తూ.. ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలకు తగిన సూచనలు చేస్తున్నారు.

ప్రతి నర్సరీలో 10వేలు..

జిల్లా అధికారులు మండలానికి ఇచ్చిన లక్ష్యం 1.95 లక్షల మొక్కల పెంచడం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని కొత్తగా ఏర్పడిన చిన్న గ్రామ పంచాయతీలు మినహా ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 10 వేల మొక్కలు పెంచేందుకు అవసరమైన బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేశారు. అదేవిధంగా మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రాంతాలను ముందుగానే గుర్తిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పూర్తయిన విత్తనాలు నాటే పనులు

మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇప్పటికే విత్తనాలు నాటే పనులు పూర్తి చేశారు. నూతనంగా ఏర్పడిన వసురాంతండా, ముందలి తండాల్లో నర్సరీల ఏర్పాటుకు స్థలాలు పరిశీలిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. నర్సరీల్లో ముఖ్యంగా మొదుగ, కుంకుడు, చింత, నెమలినార, వేప, కానుగ, విప్ప, ఈత, కర్జూరం మొక్కల విత్తనాలను ఎక్కువగా నాటించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద నాటుకునేందుకు వీలుగా జామ, దానిమ్మ మొక్కలకు సంబంధించిన విత్తనాలు నాటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జూలై నాటికి..



మండలంలో నూతనంగా ఏర్పడిన రెండు గ్రామ పంచాయతీలు మినహా అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో బ్యాగ్‌ల్లో విత్తనాలు నాటించాం. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే విత్తనాలు మెలకెత్తాయి. 2025 జులై నాటికి నాటించేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వర్షాలు కురిసిన వెంటనే గుంతలు తీయించి మొక్కలు నాటిస్తాం.

– వెంకటాచారి, ఎంపీడీఓ, ఖిల్లాఘనపురం

సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భరత్‌భూషణ్

కొత్తకోట: పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు కొమ్ము భరత్ భూషణ్ సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.14.95 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. అదేవిధంగా 9 నెలల క్రితం టీయూఎఫ్ఐడీసీ కింద టెండర్లయినప్పటికీ పలు వార్డుల్లో నేటికీ కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదన్నారు. మార్కెట్ యార్డు, శ్మశాన వాటికలు, రోడ్ల విస్తరణ పనులు పూర్తి అయ్యేవిధంగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. సోమవారం పీడీఎస్‌యూ నాయకులు మండలంలోని తిప్పుడంపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలలో సమస్యలు తాండవిస్తున్నాయని, సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజేష్, సంజీవ్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలను విలీనం చేయొద్దు



రోడ్డుపై బైఠాయించిన బలిజపల్లి గ్రామస్తులు

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి గ్రామ పంచాయతీలను కలిపి ఒకే పంచాయతీగా మార్చాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బలిజపల్లి గ్రామస్తులు సోమవారం రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఘణపురం, మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. కలెక్టర్ రావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ, ఈ నిర్ణయాన్ని వెంటనే పునరాలోచించాలని పట్టుబట్టారు. గ్రామస్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ఇలాంటి విలీనాలు స్థానిక అవసరాలను అనుసరించి ఉండాలని, లేకపోతే గ్రామాల అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి లాగే రెండు గ్రామాలు వేరుగా గ్రామ పంచాయతీలుగా కొనసాగించేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి చొరవ తీసుకోవాలి అని గ్రామస్తులు కోరారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో పెద్దమందడి ఎస్ యుగంధర్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలు, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల హెచ్‌ఎంలు వంటగది పరిసరాల పరిశుభ్రత, తాజా కూరగాయాల వినియోగంపై నిరంతరం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకే..

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ప్రతి వారం వివిధ అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఇంగ్లిష్ భాషలో స్వీయ పరిచయం అనే అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి విభాగంలో యస్వంత్‌రెడ్డి (పీఎస్, వెంగళాయిపల్లి), 6వ తరగతి నుంచి 7వ తరగతి విభాగంలో నందిని (యూపీఎస్ దావాజిపల్లి) 8వ తరగతి నుంచి 10వ తరగతి విభాగంలో శ్రావణి (హైస్కూల్ కేతేపల్లి) విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు



తెల్లరాళ్లపల్లితండాలో ఉపాధి పనులపై చర్చిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్, రేమద్దుల, తెల్లరాళ్లపల్లితండా, చిక్కేపల్లి, మల్లాయిపల్లి, మాందాపూర్, దావాజిపల్లి గ్రామాల్లో ఉపాధి పనుల సామాజిక తనిఖీపై సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి గ్రామంలో ఏప్రిల్, 2023 నుంచి 31 మార్చి, 2024 వరకు నిర్వహించిన ఉపాధి పనుల్లో రూ.223.695 లక్షలకు సంబంధించిన పనులు, చేసిన ఖర్చుపై గ్రామ సభలో పనుల వారీగా చర్చించి, అభ్యంతరాలను నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది పేర్కొన్నారు.

నేడు గ్రామసభలు ఉన్న గ్రామాలు

ఉపాధి పనుల సామాజిక తనిఖీపై మంగళవారం మండలంలోని కేతేపల్లి, దొండాయిపల్లి, కదిరెపాడు, వెంగళాయిపల్లి, అన్నారంతండా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి




నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆత్మకూర్: కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రైతులను చిత్రహింసలకు గురి చేస్తున్నారని వామపక్షాలు, రైతు సంఘాల నాయకులు దుయ్యబట్టారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ జీఓ కాపీలను దహనం చేశారు. పంజాబ్ సరిహద్దులో రైతులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే దేశానికి అన్నం పెడుతున్న రైతులపై లాఠీచార్జ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీహరి, ప్రసాద్, రాజు, రాబర్ట్, బుచ్చన్న, మోష, లక్ష్మీనారాయణశెట్టి, వెంకటన్న, మల్లేష్, లింగన్న, రైతులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకొని, రైతులపై కేసులు ఎత్తి వేయాలని సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఐటీయూ, సంయుక్త కిసాన్ మార్చ్, రైతు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం నూతన వ్యవసాయ మార్కెట్ జీఓ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ నల్ల వ్యవసాయ చట్టాలను మరో రూపంలో తీసుకొచ్చే పరిస్థితి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పరమేశ్వరాచారి, శివవర్మ, ఆది, తారాసింగ్, మదన్, నంది మళ్ల రాములు, గట్టన్న, బీసన్న పాల్గొన్నారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం రైతాంగ ఉద్యమంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, అజయ్ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ రైతులకు ఇచ్చిన హామీలను అమలు పర్చాలంటూ 27 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నాడని, ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందని వైద్యులు చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, మోహన్, శంకర్, యువకర్ణ, పెంటన్న, మాసన్న, విష్ణు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కల్వరాలలో సర్వే చేస్తున్న అధికారులు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఈనెల 9 నుంచి సర్వే చేస్తున్నారు. సోమవారం వరకు సర్వే 39 శాతం వరకు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజాపాలనలో వచ్చిన 13,540 దరఖాస్తుల ఆధారంగా వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోని వారికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదన్నారు.

వీపనగండ్ల: అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు సర్వే కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలకు గాను 7,592 మంది ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తులు చేసుకున్నారని, ఇప్పటి వరకు 2,271 దరఖాస్తులపై సర్వే పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం కల్వరాలలో టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్‌తో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ సర్వేను పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నిస్తానని అన్నారు.

పీవీ నర్సింహారావు సేవలు మరువలేనివి



ఆత్మకూర్: భారత మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నర్సింహారావు బహుభాష కోవిదుడు అని, దేశాభివృద్ధిలో ఆయన చెరగని ముద్ర వేశారని బ్రాహ్మణ సంఘం నాయకులు కొనియాడారు. పీవీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి ఆత్మకూర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయ ఆవరణ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణసంఘం జిల్లా నాయకులు జ్యోషి గుండాచారి, వెంకటనర్సింహారావు, శ్రీధర్‌జ్యోషి, రాఘవేందర్‌రావు, మస్తీపురం రాజు, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్‌రావుదివాన్జీ, న్యాయవాది అశోక్‌కుమార్‌రావు తదితరులు ఉన్నారు.

మహబూబ్ ఉస్సేనీ ఉర్సు



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్, ధర్మాపురం గ్రామాల్లో సోమవారం హాజరత్ మహబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్ ఉర్సు సోమవారం ఘనంగా నిర్వహించారు. దర్గా షరీఫ్‌ల వద్ద భక్తులు కందూర్‌లు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు కుల, మతాలకు అతీతంగా మతసామరస్యంతో ఉర్సును నిర్వహించుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఉర్సు సందర్భంగా దర్గా ఆవరణలో భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

యువతి అదృశ్యం

గోపాల్‌పేట: యువతి అదృశ్యం కావడంపై గోపాల్‌పేట పీఎస్‌లో కేసు నమోదయిందని ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఓ యువతికి మంగళవారం పెళ్లి కావాల్సి ఉంది. ఆదివారం పెళ్లికి సంబంధించిన వస్తువులు కొంటానని చెప్పి ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి ఆదివారం సాయంత్రం వరకు యువతి తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో అడిగినా ఆచూకీ లభించలేదు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

ఎస్ఐకి సన్మానం

కొత్తకోట రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బి.ఆనంద్‌ను సోమవారం పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల విషయంలో పార్టీలకు అతీతంగా సహకరిస్తామని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని నాయకులు కోరారు. శాంతి భద్రతల విషయంలో పార్టీలకు అతీతంగా సహకరించాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్ ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయ బృందం

కొత్తకోట రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల పట్టణ కేంద్రంలోని ఎస్‌వీకేఎం మైదానంలో ఈనెల 21న నిర్వహించిన 2.0 క్రీడోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో కొత్తకోట కేపీఎస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు స్కూల్ చైర్మన్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, అదేవిధంగా బాలికల విభాగంలో ఖోఖో ప్రథమ స్థానం సాధించడంతో పాటు వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు పారిస్ పారా ఒలంపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవంజి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఎంపీ రమేష్ నాగపురి బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను రాజవర్ధన్‌రెడ్డి అకాడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, చంద్రహాసన్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్యాంసుందర్

అమరచింత: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరుపేద క్రైస్తవ మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ శ్యాంసుందర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగానే క్రిస్మస్ పండుగ రోజు పేద క్రైస్తవ మహిళలు నూతన వస్త్రాలు లేక సంతోషానికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో వారందరికీ చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అమరచింత పట్టణంలోని మహిళలకే కాకుండా మండలంలోని ఆయా గ్రామాల్లోని నిరుపేదలకు చీరలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ హ్యాపీపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ పాల్గొన్నారు.

గణితంలో మెళకువలు నేర్చుకోవాలి



విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న ఎంఈఓ తదితరులు

ఖిల్లాఘనపురం: పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ల్యాబ్ ను సద్వినియోగం చేసుకుని గణితంలో మెలకువలు నేర్చుకోవాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓతో పాటుగా ఎంఎన్ఓ లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ వెంకటరమణ హాజరయ్యారు. గణిత ఉపాధ్యాయులు శోభారాణి, శారద టీఎల్ఎం ప్రదర్శన, రంగవల్లులు వేశారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గణిత దినోత్సవాన్ని పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న హెచ్‌ఎం మునావర్ సుల్తానా, గణిత ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందించేందుకు ఆర్థిక సహకారం అందించిన వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులుగౌడ్, మాజీ సర్పంచు వెంకటరమణ, సాన్విఅరోన్ స్వచ్ఛంద సేవాసంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మిమిక్రీ ఆర్టిస్టు హరిబాబు చేసిన ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో హెచ్‌ఎం మునావర్ సుల్తానా, దీర్ఘాయువు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ యుగంధర్

వనపర్తి విద్యావిభాగం: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్ యుగంధర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేడీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 4, 5వ తరగతి విద్యార్థుల యొక్క ఆంగ్ల భాష, గణిత సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు జాలి ఫోనిక్స్ యాక్టివిటీస్ ద్వారా ఇంగ్లిష్ అక్షరాలు, పదాలను పలకడం, చదవడం, రాయడం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ప్రకారం బోధన చేయాలని ఆదేశించారు.